సాక్షి
కుమురం భీం
శుక్రవారం । 27 । డిసెంబర్ । 2024



బాసరలో భక్తుల రద్దీ

వరుస సెలవులు రావడంతో బాసరలో రద్దీ పెరిగింది. శ్రీజ్ఞాన సరస్వతీ అమ్మవారి దర్శనానికి భక్తులు క్యూలైన్‌లో బారులు తీరారు. 8లో▸



ముగిసిన జాతీయస్థాయి పోటీలు

బెల్లంపల్లిలో జాతీయ స్థాయి సాఫ్ట్ బేస్‌బాల్ పోటీలు గురువారం ముగిశాయి. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. 8లో▸

గరిష్టం/కనిష్టం
29.7 /20.1

వాతావరణం

అల్పపీడనం ప్రభావంతో ఆకాశం చాలా వరకు మేఘావృతమై ఉంటుంది. కనిష్ట ఉష్ణోగ్రతలు పెరిగి చలి తీవ్రత తగ్గుతుంది.

రివైండ్ 2024

ప్రజల గొంతుక.. సాక్షి

2024 ఏడాది కాలగర్భంలో కలిసిపోతోంది. ప్రజల పక్షపాతి.. 'సాక్షి' ఈ ఏడాది ఉమ్మడి జిల్లాలోని ఎన్నో సమస్యలను వెలుగులోకి తీసుకురాగా, మరెందరో అధికారుల అవినీతిని బట్టబయలు చేసింది. గుక్కెడు నీటికి తండ్లాడే పల్లెల గొంతుక తడిపింది. అనారోగ్యంతో మంచం పట్టిన వారికి భరోసాగా నిలిచింది. ఓ వైపు గిరిజన ఉత్సవాలు.. మానవీయ కథనాలతో సత్తా చాటుతూనే అక్రమార్కుల భరతం పట్టేందుకు 'పెన్ను' బిగించింది..

- వివరాలు 8లో▸

ప్రజల గొంతుక.. సాక్షి



న్యూస్‌రీల్

28 నుంచి టీజీబీ సేవలు నిలిపివేత

వాంకిడి(ఆసిఫాబాద్): ఈ నెల 28 నుంచి 31 వరకు తెలంగాణ గ్రామీణ బ్యాంకు సేవలు నిలిపివేస్తున్నట్లు రీజనల్ మేనేజర్ ప్రభుదాస్, వాంకిడి బ్రాంచ్ మేనేజర్ జాడి కృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు(ఏపీజీవీబీ) శాఖలు 2025 నుంచి తెలంగాణ గ్రామీణ బ్యాంకులో విలీనమవుతున్న నేపథ్యంలో టీజీబీ పరిధిలోని లావాదేవీలు నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. ఏటీఎం, యూపీఐ పేమెంట్స్, ఇంటర్నెట్ బ్యాంకింగ్, బ్యాలెన్స్ ఇంక్వైరీ తదితర ఆన్‌లైన్ సేవలు, ఖాతాదారుల సేవా కేంద్రాలు(సీఎస్‌పీ) ఈ నెల 31 వరకు అందుబాటులో ఉండవని స్పష్టం చేశారు. ఖాతాదారులు ముందస్తు లావాదేవీలు చేసుకోవాలని సూచించారు. సేవలు జనవరి 1 నుంచి పునఃప్రారంభమవుతాయని తెలిపారు.

ఘనంగా వీరు బాల్ దివస్



పూజలు చేస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్

కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ పట్టణంలోని గురుద్వార్ మందిరంలో గురువారం వీరు బాల్ దివస్ ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ వీరబాలుల త్యాగాల గురించి నేటి తరానికి తెలిసేలా కార్యక్రమాలు చేపట్టాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారని తెలిపారు. మతోన్మాదులకు తలవంచకుండా గురువుల మాట తప్పకుండా ధర్మాన్ని వీడకుండా ముక్కుపచ్చలారని వయస్సులో ధైర్యసాహసాలు కనబర్చి ధర్మం కోసం ప్రాణత్యాగం చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు విజయ్‌సింగ్, వీరభద్రచారి తదితరులు పాల్గొన్నారు.

'సమగ్ర' ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ఆసిఫాబాద్‌రూరల్: సమగ్ర శిక్షా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించి, సమ్మె విరమింపజేయాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు శాంతికుమారి గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. వారికి ఉద్యోగ భద్రత కల్పించి, మొదటి పీఆర్సీ సిఫారసు మేరకు రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా సెలవులు, ఇంక్రిమెంట్లు ఇవ్వాలన్నారు.

బలహీన వర్గాల పక్షాన సీపీఐ పోరాటం



సీపీఐ జెండావిష్కరిస్తున్న సత్యనారాయణ

రెబ్బెన(ఆసిఫాబాద్): బడుగు, బలహీన వర్గాల ప్రజల పక్షాన సీపీఐ పోరాడుతుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి బద్రి సత్యనారాయణ అన్నారు. రెబ్బెన మండలం గోలేటి టౌన్‌షిప్‌లోని కేఎల్ మహేంద్రభవన్‌లో గురువారం సీపీఐ వందో ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పార్టీ పతాకం ఆవిష్కరించి కేక్ కట్ చేశారు. ఆయన మాట్లాడుతూ త్యాగాలు, పోరాటాల చరిత్ర కలిగిన సీపీఐ పార్టీ జెండా పట్టుకుని పేద ప్రజల పక్షాన పోరాడుతామన్నారు. ఎర్రజెండా అండతోనే భూమిలేని నిరుపేదలకు వందల ఎకరాల భూపంపిణీ జరిగిందని గుర్తు చేశారు. ఓట్లు సీట్లు, పొత్తులు ఎత్తుల వంటి ప్రలోభాలకు లొంగకుండా పోరాడుతున్నది కేవలం సీపీఐ పార్టీ మాత్రమే అన్నారు. కార్యక్రమంలో మండల సహాయ కార్యదర్శి జగ్గయ్య, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ గోలేటి బ్రాంచి కార్యదర్శి ఎస్.తిరుపతి, ఉపాధ్యక్షుడు బయ్యు మొగిళి, ఆర్గనైజింగ్ కార్యదర్శులు శేషశయనరావు, రాజేశ్, కిరణ్‌బాబు, చంద్రశేఖర్, సీపీఐ బెల్లంపల్లి కార్యవర్గ సభ్యుడు శ్రీనివాస్, కాంట్రాక్టు కార్మిక సంఘం నాయకులు అశోక్, సాగర్, పిట్ కార్యదర్శులు మారం శ్రీనివాస్, ఎంబడి రామయ్య, కందుల మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా చెక్‌పోస్టు వెనుక బీడీపీపీ భూముల్లో వెలసిన వాణిజ్య సముదాయాలు



కన్నేశారు.. అమ్మేశారు!



చెక్‌పోస్టు ఎదురుగా నిర్మాణంలో భవనాలు

- బీడీపీపీ భూములు అన్యాక్రాంతం
- ఆసిఫాబాద్‌లో 240 ఎకరాలు కబ్జా
- నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు
- పట్టించుకోని అధికార యంత్రాంగం
- నోటీసులతో సరిపెడుతున్న వైనం

సాక్షి, ఆసిఫాబాద్: ప్రభుత్వాలు మారుతున్నాయి. ప్రజాప్రతినిధులు, అధికారులు మారుతున్నారు.. కానీ జిల్లా కేంద్రంలో ఉన్న బీడీపీపీ(బిలాదాఖల పోరంపోకు) భూముల్లో మాత్రం ఆక్రమణలు ఆగడం లేదు. కొత్తగా జిల్లా ఏర్పాటు అయినప్పటి నుంచి ఈ బీడీపీపీ భూముల ఆక్రమణలపై చాలాసార్లు విచారణలు జరిగాయి. ఆ సమయంలో కొద్దిరోజుల పాటు నిర్మాణాలు ఆపేస్తున్నారు. తర్వాత రాజకీయ జోక్యం, రెవెన్యూ శాఖ కిందిస్థాయి సిబ్బంది సహకారంతో మళ్లీ నిర్మాణాలు ప్రారంభిస్తున్నారు. వివిధ పార్టీల ప్రజాప్రతినిధులు, కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు అమాయకుల నుంచి డబ్బులు తీసుకుని రూ.100 బాండు పేపర్లపై 100 నుంచి 200 గజాల వరకు స్థలాలను విక్రయిస్తున్నారు. ఒకరకంగా చెప్పాలంటే ప్రభుత్వ భూమిని నాయకులు సొంత ఆస్తిలా అమ్ముకుంటున్నారు. అధికారుల నుంచి అభ్యంతరాలు రాకుండా పైరవీలు చేస్తున్నారు. గతంలో రెవెన్యూ అధికారులు అడ్డుకున్న ప్రాంతాల్లోనే మళ్లీ ఇప్పుడు కొత్త ఇళ్లు వెలుస్తుండటం గమనార్హం.

నోటీసులిచ్చినా ఆగని పనులు..

అటవీ చెక్‌పోస్టుకు వెనుకా ముందు వైపు ఉన్న బీడీపీపీ భూముల్లో రెండంతస్తుల భవనాల నిర్మాణ పనులు జోరుగా సాగుతున్నాయి. అదేవిధంగా చెక్‌పోస్టు వెనుక నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణ పనులు పూర్తి చేసుకున్న వాణిజ్య భవనాలు త్వరలో ప్రారంభానికి సిద్ధమవుతుండటం గమనార్హం. వీటికి రెవెన్యూ అధికారులు ఇదివరకే నోటీసులు ఇచ్చినా.. సదరు నిర్మాణదారులు పనులేవీ ఆపకపోవడం విచిత్రం. రాజకీయ నేతల ఒత్తిళ్లు, మామూళ్లు అందిన నేపథ్యంలోనే రెవెన్యూ అధికారులు అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అటవీ చెక్‌పోస్టుకు సమీపంలోనే..

ఆసిఫాబాద్ పట్టణంలోని అటవీ చెక్‌పోస్టు సమీపంలోని 1 నుంచి 41వ సర్వే నంబర్లలో మొత్తం 240 ఎకరాల విస్తీర్ణంలో బీడీపీపీ భూమి ఉంది. దశాబ్దాల కిందట బడుగు, బలహీన వర్గాలు, పేదలకు సాగు కోసం ఈ భూములను అసైన్డ్ చేశారు. మొత్తం 78 మందికి ఈ భూములను లావుణి పట్టా రూపంలో ఇచ్చారు. ప్రస్తుతం ఈ భూములు చాలా వరకు లబ్ధిదారుల నుంచి చేతులు మారాయి. ఈ భూములు అన్యాక్రాంతమవడంలో అప్పట్లో అధికార పార్టీకి చెందిన ఓ మాజీ ప్రజాప్రతినిధి, అతని అనుచరుడైన రియల్ ఎస్టేట్ వ్యాపారి కీలక పాత్ర పోషించినట్లు తెలుస్తోంది. ఆ ఇద్దరు వ్యక్తుల ప్రోద్బలంతోనే అటు రెవెన్యూ, ఇటు రిజిస్ట్రేషన్ల శాఖలో చక్రం తిప్పి ప్రభుత్వ భూములను ప్రైవేటు భూములుగా రికార్డులు తారుమారు చేసి పట్టాలు సృష్టించారన్న ఆరోపణలు ఉన్నాయి. ప్రస్తుతం మార్కెట్ ధర ప్రకారం ఈ భూముల విలువ రూ.500 కోట్ల పైమాటేనని అంచనా.

నిబంధనలకు తిలోదకాలు

కేవలం సాగు కోసం వినియోగించాల్సిన ఈ అసైన్డ్ భూములను అమ్మడం, కొనడం చేయొద్దు. అలాగే భూమి స్వభావాన్ని(వ్యవసాయ భూములను వ్యవసాయేతర భూములుగా) మార్చరాదు. కానీ నిబంధనలకు తిలోదకాలిచ్చిన అక్రమార్కులు యథేచ్ఛగా నాలా కన్వర్షన్ లేకుండానే బీడీపీపీ భూములను ప్లాట్లుగా విభజించి క్రయవిక్రయాలు చేపడుతున్నారు. గ్రామ పంచాయతీ అధికారులు సైతం నిర్మాణాలకు అనుమతులు ఇవ్వడంతో అటవీ చెక్‌పోస్టు ప్రాంతంలో దర్జాగా అక్రమ కట్టడాలు వెలిశాయి. తాజాగా ఓ వ్యక్తి బీడీపీపీ భూమిని చదును చేసి చుట్టూ కంచె వేసిన ఘటన వెలుగు చూసింది. రెవెన్యూ అధికారులు సదరు కొనుగోలుదారుడికి నోటీసు ఇచ్చి కంచెను తొలగించడంతో బీడీపీపీ భూముల అన్యాక్రాంతంపై పట్టణంలో చర్చ జోరందుకుంది.

చర్యలు తీసుకుంటాం

ఆసిఫాబాద్ రెవెన్యూ మ్యాప్ కోసం రీ సర్వేకు కోరాం. రీ సర్వే పూర్తయిన తర్వాత ప్రభుత్వ భూములకు సంబంధించిన పూర్తి వివరాలు తెలుస్తాయి. అయితే బీడీపీపీ భూముల్లో నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టిన వారికి నిర్మాణాలు ఆపాలని ఇదివరకే నోటీసులు అందించాం. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటాం. రెవెన్యూ, మున్సిపాలిటీ అధికారుల సమన్వయంతో అక్రమ కట్టడాలు కూల్చి వేస్తాం.

– లోకేశ్వర్‌రావు, ఆర్డీవో, ఆసిఫాబాద్

సింగరేణి జిగేల్



ఒడిశా నైనీ బ్లాక్ వద్ద అధికారులతో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క(ఫైల్)

- ఉత్పత్తి, లాభాల్లో రికార్డులు
- నైనీకి అన్ని క్లియరెన్సులు
- తగ్గిన ప్రమాదాలు
- 2024లో అన్నీ మైలు రాళ్లే

రివైండ్ 2024

శ్రీరాంపూర్: రాష్ట్రంలో పేరెన్నిక గల సింగరేణి సంస్థ 2024లో జిగేల్‌మని మెరిసింది. అనుకున్న లక్ష్యాలను సాధించిన సంస్థ అభివృద్ధి పథంలో పయనించింది. కంపెనీ 2023–24 ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాన్ని నమోదు చేసింది. 70.20మిలియన్ టన్నుల ఉత్పత్తిని నమోదు చేసుకుంది. ఆ లక్ష్యాన్ని అధిగమించేలా ఈసారి 2024–25లో 72మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకు సాగుతోంది. గత ఆర్థిక సంవత్సరంలో కంపెనీ ఇంత పెద్దమొత్తంలో బొగ్గు ఉత్పత్తి చేసి ఆల్‌టైం రికార్డును నెలకొంది. దీంతో కంపెనీ రూ.4,701 కోట్ల నికర లాభాలను ఆర్జించింది. ఇందులో పెట్టుబడులు పోను మిగిలిన రూ.2,412 కోట్ల నుంచి 33శాతం వాటాగా రూ.796 కోట్లను కార్మికులకు వాటా రూపంలో పంపిణీ చేసింది. గత సంవత్సరం కంటే ఒక శాతం పెంచి ఇవ్వడంతో ఒక్కో కార్మికుడికి రూ.1.90లక్షలు వాటా డబ్బులు వచ్చాయి.

కాంట్రాక్ట్ కార్మికులకు కొత్తహక్కు

సింగరేణి కాంట్రాక్టు కార్మికులు కంపెనీ లాభాల్లో వాటా కోసం చాలా ఏళ్లుగా డిమాండ్ చేయగా.. చివరికి ఈసారి బోనస్ చెల్లించారు. లాభాల్లో నుంచి కార్మికులకు రూ.5వేల చొప్పున బోనస్ అందజేశారు. దీంతో సుమారు 30వేల మంది వరకు ప్రయోజనం పొందారు. సింగరేణిలో కొత్తగా 2,165 మందికి ఉద్యోగాలు కల్పించారు. ఇందులో కారుణ్యం నియామకాలు 1367, ఎక్స్‌టర్నల్ ద్వారా 796 మందికి ఉద్యోగాలు కల్పించారు. దీంతోపాటు కొత్తగూడెంలో 10.5 మెగావాట్ల సోలార్ ప్లాంటును కంపెనీ ప్రారంభించింది. మూడేళ్లుగా నలుగుతూ వస్తున్న ఒడిశా నైనీ బొగ్గు బ్లాక్‌కు ముందడుగు పడింది. జూలై 12న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఒడిశా వెళ్లి అక్కడి ముఖ్యమంత్రితో చర్చించి దానికి కావాల్సిన అన్ని రకాల అక్కడి ప్రభుత్వ అనుమతులు సాధించారు. దీంతో 2025 జనవరి నుంచి బొగ్గు ఉత్పత్తి మొదలు కానుండంతో మరో మైలు రాయిగా చెప్పవచ్చు. ప్రమాదాలు కూడా 2023 కంటే తగ్గాయి. 2024లో వివిధ ప్రమాదాల్లో ఐదుగురు కార్మికులు మరణించారు.

బీమా తెచ్చిన ధీమా..

గని ప్రమాదంలో మృతిచెందిన కార్మికులకు రూ.కోటి ప్రమాద బీమా సౌకర్యాన్ని మొదటిసారిగా కంపెనీ కల్పించింది. కంపెనీ చూపిన బ్యాంకుల్లో సాలరీ అకౌంట్‌ను ప్రారంభించుకునేలా ప్రోత్సహించి వారికి ఈ సౌకర్యం వర్తింపజేసింది. దీంతోపాటు కాంట్రాక్ట్ కార్మికులకు కూడా రూ.30 లక్షల బీమా సౌకర్యం కల్పించారు. కారుణ్య ఉద్యోగుల వయస్సు 35 ఏళ్ల నుంచి 40 ఏళ్లకు పెంచారు. సింగరేణి నిధులు కేటాయించిన రామగుండంలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీలో సింగరేణి ఉద్యోగుల పిల్లల కోసం 7 సీట్లను కేటాయించారు. నాలుగేళ్ల తర్వాత కార్మికుల సమస్యల పరిష్కారానికి వేదికలైన స్ట్రక్చర్ కమిటీ సమావేశాలు మొదలయ్యాయి. గుర్తింపు సంఘం, యాజమాన్యానికి మధ్య జరిగిన చర్చల్లో కార్మికుల అనేక పెండింగ్ డిమాండ్లు పరిష్కారానికి నోచుకున్నాయి. ఇదిలా ఉంటే సామాజిక బాధ్యతలో భాగంగా సివిల్స్ మెయిన్స్ పరీక్షల్లో విజయం సాధించిన తెలంగాణ అభ్యర్థులు 135 మందికి రాజీవ్ సివిల్స్ అభయహస్తం కింద సింగరేణి రూ.లక్ష చొప్పున ప్రోత్సాహక నగదు అందజేసింది. పర్యావరణహిత మైనింగ్, సోలార్ విద్యుత్ ఉత్పత్తికి గాను సింగరేణి జాతీయ స్థాయిలో కేంద్రం ఎలక్ట్రిసిటీ అథారిటీ సంస్థ అవార్డును అందించింది. ఇలా సింగరేణికి అన్ని రంగాల్లో 2024లో శుభాలే జరిగాయి.

కనుల పండువగా మహా పడిపూజ

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని శ్రీహరిహర పుత్ర అయ్యప్ప స్వామి ఆలయంలో అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం మండల మహాపడి పూజా కార్యక్రమం కనుల పండువగా నిర్వహించారు. అర్చకులు జంబోజుల నాగేశ్వర్ ఆధ్వర్యంలో సుప్రభాత సేవ, గణపతి పూజ, పుణ్యాహవచనం, మహాభిషేకం, హోమం నిర్వహించగా, సాయంత్రం నగర సంకీర్తన చేపట్టారు. ఎమ్మెల్యే కోవ లక్ష్మి దంపతులు హాజరై స్వయంగా భోజనం వడ్డించారు. రాత్రి 7 గంటలకు ఆలయంలో మండల మహా పడిపూజ మహోత్సవం ఘనంగా నిర్వహించారు.



అయ్యప్ప స్వాములకు భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి



నగర సంకీర్తన నిర్వహిస్తున్న అయ్యప్ప స్వాములు

పులి భయం.. గ్రామాల్లో అవగాహన



ఇటిక్యాల పహాడ్‌లో అవగాహన కల్పిస్తున్న అటవీశాఖ అధికారులు

సిర్పూర్(టి): మండలంలోని ఇటిక్యాల పహాడ్, మాకిడి, జాక్కపూర్, హుడ్కిలి, చీలపెల్లి గ్రామాల్లో గురువారం సిర్పూర్(టి) రేంజ్ అధికారి ఇక్బాల్ హుస్సేన్ ఆధ్వర్యంలో అధికారులు పులి సంచారం, సంరక్షణ, ఆవశ్యకత తదితర అంశాలపై అవగాహన కల్పించారు. రేంజ్ అధికారి మాట్లాడుతూ మాస్కులు ధరించి చేనుకు వెళ్లాలని, వ్యవసాయ పనులకు ఒంటరిగా కాకుండా గుంపులుగా వెళ్లాలని సూచించారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పనులు ముగించుకోవాలన్నారు. డీఆర్‌వో శ్రీధర్ చారి, ఎఫ్ఎస్‌వో మోహన్‌రావు, ఎఫ్‌బీవోలు నరేశ్, అరవింద్, సంతోష్, సిబ్బంది అంజద్, ఇర్ఫాన్, హబీబ్ పాల్గొన్నారు.

బోధనకు బ్రేక్..!

- నేటి నుంచి సమ్మెలోకి వందశాతం కేజీబీవీ, యూఆర్‌ఎస్ టీచింగ్ స్టాఫ్
- త్వరలో వంట కార్మికులు కూడా..
- నష్టపోనున్న విద్యార్థులు



మోడి కేజీబీవీలో టీచర్లు లేకపోవడంతో సొంతంగా చదువుకుంటున్న విద్యార్థినులు

కెరమెరి(ఆసిఫాబాద్): ఉద్యోగాలు క్రమబద్ధీకరించాలని జిల్లా కేంద్రంలో 17 రోజులుగా సమగ్ర శిక్షా ఉద్యోగులు సమ్మె చేపడుతుండగా ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు వారికి స్పష్టమైన హామీ రాలేదు. కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాలు, అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్‌లోని వందశాతం టీచర్లు సమ్మెలోకి వెళ్లనున్నారు. 'సమగ్ర' ఉద్యోగుల సంఘం నాయకులు ఇప్పటికే జిల్లా విద్యాధికారి యాదయ్య, కలెక్టర్ వెంకటేశ్ దోత్రేను కలిసి వినతిపత్రం అందించారు. టీచింగ్ సిబ్బంది వందశాతం సమ్మెలోకి వెళ్తుండటంతో బోధన నిలిచిపోనుంది.

జిల్లాలో ఇలా..

జిల్లాలో 15 కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాలు, ఆసిఫాబాద్‌లో ఒక అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్ ఉండగా, 4,168 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. పదో తరగతి, ఇంటర్ వార్షిక ఫలితాల్లో ఇవి ఏటా మెరుగైన ఉత్తీర్ణత సాధిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నాయి. ప్రస్తుతం సమ్మె కారణంగా ఆయా పాఠశాలల్లో ఇద్దరు సీఆర్‌టీలు పగలు, మరో ఇద్దరు రాత్రిపూట విధులు నిర్వర్తిస్తున్నారు. సీఆర్టీలు, ఏఎన్‌ఎంలు, అకౌంటెంట్లు ఆందోళనల్లో పాలు పంచుకుంటున్నారు. శుక్రవారం నుంచి వంట కార్మికులు మినహా ఎస్‌వోలతోపాటు బోధన సిబ్బంది, ఇతరులు పూర్తిస్థాయిలో సమ్మెలో పాల్గొనాలని నిర్ణయించారు. వార్షిక పరీక్షలు సమీపిస్తున్నందున విద్యార్థులు నష్టపోయే పరిస్థితులు ఏర్పడ్డాయి.

తాత్కాలిక ఎస్‌వోల నియామకం..!

వందశాతం సమ్మెలోకి వెళ్తున్నట్లు కేజీబీవీ, యూఆర్‌ఎస్ సిబ్బంది మూడు రోజుల క్రితమే జిల్లా ఉన్నతాధికారులకు నోటీసులు అందించారు. అప్రమత్తమైన విద్యాశాఖ ప్రత్యామ్నాయ చర్యలకు సిద్ధమైంది. ఆసక్తి గల స్కూల్ అసిస్టెంట్లను ఎస్‌వోలను తాత్కాలికంగా నియమించనున్నారు. ఇప్పటికే ఆయా మండలాల నుంచి విధులు నిర్వర్తించేందుకు ఆసక్తి ఉన్నవారి వివరాలను సేకరించారు. శుక్రవారం నుంచి వారు బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉంది. ఒక్కో విద్యాలయంలో 12 నుంచి 16 మంది సీఆర్టీలు, పీజీ సీఆర్టీలు పనిచేస్తున్నారు. బోధనకు ఆటంకం లేకుండా మహిళా ఉపాధ్యాయులను నియామకంపై మాత్రం స్పష్టతనివ్వలేదు. ఎస్‌వోలు తాత్కాలిక బాధ్యతలు స్వీకరించిన వెంటనే వంట కార్మికులు సైతం సమ్మెకు సిద్ధమవుతున్నారు. వంట కార్మికులు, ఏఎన్‌ఎంలు, అకౌంటెంట్, స్వీపర్, వాచ్‌మెన్‌లు లేకుండా విద్యాలయాల నిర్వహణ సాధ్యంకాదనే అభిప్రాయం వ్యక్తమవుతుంది.

జిల్లా వివరాలు

కేజీబీవీలు	15
యూఆర్‌ఎస్	1
ఎస్‌వోలు	16
సీఆర్టీలు	92
పీజీ సీఆర్టీలు	65
ఏఎన్‌ఎంలు	10
అకౌంటెంట్లు	10
పీఈటీలు	12
వంట కార్మికులు	114
విద్యార్థులు	4,168

మేమే చదువుకుంటున్నాం



కస్తూరిబా విద్యాలయాల్లో చదువులు చెప్పేవారు లేరు. 15 రోజులుగా మేమే సొంతంగా చదువుకుంటున్నాం. ఇంకెన్ని రోజులు టీచర్లు లేక ఇబ్బంది పడాలి. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించాలి.

– కె.రుక్మాబాయి, ఇంటర్ సెకండియర్, మోడి కేజీబీవీ

బాగోగులు చూసేవారేరి..?



ఉపాధ్యాయులతోపాటు ఇతర సిబ్బంది కూడా సమ్మెలో ఉండటంతో కేజీబీవీలో మా బాగోగులు చూసేవారు లేకుండా పోయారు. పాఠ్యాంశాల్లో సందేహాలు నివృత్తి చేసేవారు లేరు. కొత్త వారు వస్తే మాకు ఇబ్బందే.

– ఎస్.కృష్ణవేణి, పదో తరగతి, మోడి కేజీబీవీ

ఒత్తిళ్లకు భయపడం



ప్రభుత్వం సమగ్ర శిక్షా ఉద్యోగులను ఎలాంటి షరతులు లేకుండా రెగ్యులరైజ్ చేయాలి. సమస్యలు పరిష్కారమయ్యే వరకు సమ్మె విరమించే ప్రసక్తి లేదు. ఉన్నతాధికారులు, ప్రభుత్వం నుంచి ఎన్ని ఒత్తిళ్లు వచ్చినా భయపడం

– శృతిక, సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షురాలు

ప్రజల గొంతుక.. సాక్షి

- ప్రజల పక్షపాతిగా కథనాలు
- స్పందించిన అధికారులు
- అక్రమార్కులపై చర్యలు

ప్రజా సమస్యల పరిష్కారానికి 'సాక్షి'తనవంతుగా కృషి చేస్తోంది. ఇందులో భాగంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ప్రభుత్వ విభాగాల్లో అన్యాయాలు, అక్రమాలకు పాల్పడిన వారిపై కొరడా ఝులిపించేలా ప్రత్యేక కథనాలు ప్రచురించింది. వీటికి జిల్లా అధికారులు స్పందించారు. నిబంధనలు అతిక్రమించిన ఉద్యోగులు, అధికారులపై శాఖ పరమైన చర్యలు తీసుకున్నారు. 2024లో సాక్షి ఎఫెక్ట్ కథనాలు..

రివైండ్ 2024



- **మంచిర్యాలఅర్బన్:** వసతిగృహాలకు నాసిరకం సరుకుల సరఫరాపై నవంబర్ 18న 'క్వాలిటీ కాంట్రాక్టర్లకే ఎరుక'`సాక్షి`లో కథనం ప్రచురితమైంది. అధికారులు స్పందించి చర్యలు తీసుకున్నారు.



- **కైలాస్‌నగర్:** 'మడిగెల మర్మమేంటో!'శీర్షికన ప్రచురితమైన కథనానికి అప్పటి మున్సిపల్ కమిషనర్ స్పందించి వేలం ప్రక్రియ నిర్వహించారు.



- **బెల్లంపల్లి:** బెల్లంపల్లి మున్సిపాల్టీ అంబేడ్కర్ రడగంబాల బస్తీలో భూ ఆక్రమణపై మార్చి 2న 'ఆగని భూ కబ్జాలు'శీర్షికన కథనం ప్రచురితమైంది. బెల్లంపల్లి ఆర్డీవో పి.హరికృష్ణ స్పందించి జేసీబీ, ట్రాక్టర్లతో ఇళ్ల పునాదులు, ఆక్రమణలు తొలగించారు.
- **ఆదిలాబాద్‌టౌన్:** డీఎస్సీ అభ్యర్థుల నియామకాల్లో విద్యాశాఖ తప్పిదాలతో పలువురికి పోస్టింగ్ ఇవ్వకపోడంతో వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. 'ఫలించిన నిరీక్షణ'కథనం ఇవ్వడంతో 11 మంది అభ్యర్థులకు పోస్టింగ్‌లు ఇచ్చారు.
- రిమ్స్ ఆడిటోరియంలో మందులు విచ్చలవిడిగా పారేడయంపై 'ఏమాత్రం శ్రద్ధలేదు'శీర్షికన కథనం 'సాక్షి'మెయిన్ పేజీలో ప్రచురితమైంది. రాష్ట్ర వైద్యారోగ్య శాఖ అధికారులు స్పందించారు. జిల్లా డ్రగ్‌స్టోర్ ఇన్‌చార్జిని సరెండర్‌తోపాటు చర్యలు తీసుకున్నారు.
- ఆదిలాబాద్‌లోని స్పోర్ట్స్ స్కూల్‌లో అక్రమ డిప్యూటేషన్లపై 'స్పోర్ట్స్‌కు పైరవీలు'శీర్షికన ప్రచురితమైన కథనానికి కలెక్టర్ స్పందించారు. డిప్యూటేషన్లను రద్దు చేసి, అర్హులైన ఉపాధ్యాయులను డిప్యూటేషన్లపై నియమించారు.
- బడిబాటలో భాగంగా 'బడిబాట అంతంతే'శీర్షికన కథనం ప్రచురితమైంది. విద్యాశాఖ అధికారులు నివేదించాలని కలెక్టర్ ఆదేశించారు.
- 'ప్రైవేట్ బస్సు డేంజర్'శీర్షికన ప్రచురితమైన కథనానికి రవాణాశాఖ అధికారులు స్పందించారు. వాహనాల తనిఖీలు చేపట్టారు. రెండు ప్రైవేట్ బస్సులను సీజ్ చేశారు.
- 'మాతృవేదన'శీర్షికన ప్రచురితమైన కథనానికి వైద్యారోగ్య శాఖ అధికారులు స్పందించారు. ప్రైవేట్ ఆస్పత్రి బిల్లుల కోసం బాధితులను వేధించడంపై ప్రచురితమైన కథనానికి కలెక్టర్ స్పందించి ఆస్పత్రికి నోటీసులు జారీ చేశారు.



- **వాంకిడి:** సోయంగూడ ప్రాథమిక పాఠశాల కొన్నేళ్లుగా మూతపడి ఉండగా ఫిబ్రవరి 4న 'అక్షరం దిద్దని ఆదివాసీ బిడ్డలు'శీర్షికన కథనం ప్రచురితమైంది. జిల్లా విద్యాశాఖాధికారులు స్పందించి పునఃప్రారంభించేలా చర్యలు తీసుకున్నారు.
- రిమ్స్‌లో 'స్ట్రెచర్‌పైనే ఐదున్నర గంటలు'శీర్షికన ప్రచురితైన కథనం ప్రచురితమైంది. కలెక్టర్ సీరియర్ అయ్యారు. ప్రొఫెసర్లతో కమిటీని ఏర్పాటు చేశారు.
- 'వచ్చిరాని వైద్యం.. శంకర్ దాదా ఎంబీబీఎస్'లు అనే వరుస కథనాలు 'సాక్షి'లో ప్రచురితం కావడంతో డీఎంహెచ్‌వో స్పందించారు. పలు ఆర్‌ఎంపీ క్లినిక్‌లపై కొరడా ఝులిపించారు.
- తలమడుగు మండలంలోని ఓ పాఠశాల టీచర్ అనుమతి లేకుండా విదేశీ పర్యటనకు వెళ్లారు. 'లీడర్ సారు.. ఇదేమి తీరు'కథనం ప్రచురితమైంది. డీఈవో స్పందించి.. సదరు టీచర్‌పై సస్పెన్షన్ వేటు వేశారు.
- తలమడుగు మండలం సాయిలింగి ప్రాథమిక పాఠశాలలో 'పంతుళ్ల కోసం విద్యార్థుల పడిగాపులు'శీర్షికన కథనం ప్రచురితమైంది. కలెక్టర్ స్పందించి టీచర్లకు మెమోలు జారీ చేశారు.
- ఉట్నూర్ ఉర్దూ మీడియం పాఠశాల టీచర్‌పై పోక్సో కేసుపై జైలుకెళ్లాడు. అయినా సస్పెండ్ చేయకపోవడంతో 'ఆ సారుపై ఎందుకంత ప్రేమ'శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో సదరు టీచర్‌పై డీఈవో సస్పెన్షన్ వేటు వేశారు.
- జిల్లాలో'గుట్టుగా మొరం అక్రమతవ్వకాలు' శీర్షికనకథనం ప్రచురితమైంది. మైనింగ్ అధికారులు టిప్పర్లు, పొక్లెయినర్లను సీజ్ చేశారు.
- నర్సింగ్ సూపరింటెండెంట్‌గా పనిచేసే ఓ అధికారికి పేషెంట్ కేర్ సిబ్బంది పీఏగా వ్యవహరించాడు. పలువురు స్టాఫ్‌నర్సులను వేధింపులకు గురిచేయడంతో 'రిమ్స్ పీఏ దాదాగిరి'అనే కథనం ప్రచురితమైంది. రిమ్స్ డైరెక్టర్ ఆయన్ను విధుల నుంచి తొలగించారు.
- టీచర్ల బదిలీల్లో కొందరు నిబంధనలను తుంగలో తొక్కారు. 'స్పౌజ్..అవకతవకలు'శీర్షికన కథనం ప్రచురితమైంది. డీఈవో స్పందించి ముగ్గురు టీచర్లకు షోకాజు నోటీసులు జారీ చేసి ఇంక్రిమెంట్‌లో కోత విధించారు.
- **తాంసి:** భీంపూర్ మండలం గోవింద్‌పూర్‌లో కిడ్నీ వ్యాధితో 12 మృతిచెందారు. గిరిజనులు గ్రామాన్ని ఖాళీ చేయడంపై సాక్షి మెయిన్‌లో ఏప్రిల్ 3న 'కిడ్నీ వ్యాధితో ఊరు ఖాళీ'శీర్షికన కథనం ప్రచురితమైంది. కలెక్టర్ ఆదేశాలతో అధికారులు వైద్యశిబిరం ఏర్పాటు చేయించారు.
- భీంపూర్ మండలం గుబిడిపల్లిని కిడ్నీ సంబంధిత వ్యాధి వేధిస్తోంది. జనవరి 10న 'ఆ ఊళ్లో కిడ్నీలు ఫెయిల్'శీర్షికన ప్రచురితమైన కథనానికి కలెక్టర్ స్పందించి వైద్యశిబిరం ఏర్పాటు చేశారు.
- **కైలాస్‌నగర్:** జిల్లాలో అక్రమ లేఅవుట్లపె 'అక్రమాలపై పట్టింపేది'శీర్షికన కథనం ప్రచురితమైంది. కలెక్టర్ స్పందించి మున్సిపల్ అధికారులపై సీరియస్ అయ్యారు.
- శివాజీచౌక్, ఓల్డ్‌బస్టాండ్ సమీపంలోని మున్సిపల్ షాపులకు ఏళ్ల అద్దెలు చెల్లించడం లేదు. ఈ తీరుపై 'అద్దెకు ఎగనామం'శీర్షికన కథనం ప్రచురితంకావడంతో కమిషనర్ స్పందించి బకాయి వసూళ్లు చేయించారు.
- పట్టణంలోని ఆసరా పెన్షన్ నిలిచిపోవడంపై 'ఆసరా అందలే!'శీర్షికన కథనాన్ని ప్రచురితమైంది. అధికారులు స్పందించి చెల్లించారు.
- జిల్లాలో గడిచిన వేసవిలో 'దాహం కేకలు' శీర్షికన కథనం ఇచ్చాం. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు స్పందించి సమస్య పరిష్కరించారు.
- **వాంకిడి:** గిరిజన పాఠశాలల్లో టీచర్లు రాకపోవడంపై 'గిరిబడులకు సార్లు దుమ్మా'ఫిబ్రవరి 7న శీర్షికన కథనం ప్రచురితమైంది. అప్పటి కలెక్టర్ స్పందించి చర్యలు తీసుకున్నారు.
- అవినీతికి పాల్పడుతున్న కానిస్టేబుల్ వ్యవహారంపై సెప్టెంబర్ 24న 'వాంకిడి పీఎస్‌లో వసూల్ రాజా'శీర్షికన కథనం ప్రచురితమైంది. జిల్లా పోలీస్ అధికారులుచర్యలు తీసుకున్నారు.
- ఎనోలి కోలంగూడలో నీటి సమస్యలపై మార్చి 17న 'తాగునీటి కష్టాలు'శీర్షికన కథనం ప్రచురితమైంది. కలెక్టర్, అడిషనల్ కలెక్టర్..సమస్య పరిష్కరించారు.
- **మంచిర్యాలఅర్బన్:** దూరంగా ఉన్నా సర్కారు బడి విద్యార్థులు పడుతున్న ఇబ్బందుల నేపథ్యంలో 'సారు బడి తరలించరూ శీర్షికన 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. అధికారులు స్పందించారు. స్టేషన్‌రోడ్ పాఠశాల బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలోకి తరలించారు.
- రెండు జిల్లాలకు సేవలందించే మంచిర్యాల ఆర్టీసీ వైద్యశాలలో వైద్యుడు లేరు. ఫిబ్రవరి 27న 'సాక్షి'లో వైద్యుడు రాడు.. మందులు లేవు శీర్షికన కథనం ప్రచురితమైంది. అధికారులు స్పందించి వైద్యుడిని నియమించారు.
- స్థానిక బస్టాండ్‌కు దగ్గర ఉన్నా బాలుర ఉన్నత పాఠశాలలో ఇతర ప్రాంతాలకు వెళ్లే వారందరూ బైక్‌లు సైకిల్ షెడ్డులో నిలిపివెళ్లేవారు. రోజుల తరబడి ఉంచటంతో విద్యార్థులు సైకిళ్లు ఎక్కడ పార్కింగ్ చేయాలో తెలియకుండా పోయింది. మార్చి 6న షెడ్డులో బైక్‌లు..చెట్ల కింద సైకిళ్లు శీర్షికన కథనం ప్రచురించటంతో హెచ్‌ఎం స్పందించి పాఠశాల గేట్‌కు తాళం వేశారు. అప్పటి నుంచి ఇతర వాహనాలు పాఠశాల ఆవరణలోకి రాకుండా పోయాయి.
- సర్కారు బడుల నిర్వహణకు సంబంధించిన రెండో విడత నిధులు విడుదల కాకపోవడంతో మార్చి 22న 'సాక్షి'బడి నిర్వహణ నిధులేవి కథనానికి అధికారులు స్పందించారు. 720 స్కూళ్లకు 50 శాతం నిధులు రూ.75.85 లక్షలు మంజూరు చేశారు.
- **మంచిర్యాలక్రైం:** జనవరి 8న గోదావరిలో ఇసుక దొంగలు శీర్షికన కథనం ప్రచురితమైంది. కలెక్టర్ స్పందించి చర్యలు తీసుకున్నారు.
- **పాతమంచిర్యాల:** జిల్లాకేంద్రంలో తపాలాశాఖకు చెందిన రైల్వేమెయిల్ సర్వీస్ సార్టింగ్ కార్యాలయం తరలింపుపై 'డిస్ట్రిబ్యూషన్ తరలింపు'పై సాక్షిలో కథనం ప్రచురితమైంది. ఉన్నతాధికారులు స్పందించారు.
- **దహెగాం:** ఏప్రిల్ 11న మొట్లగూడలో నీటి గోస శీర్షికన ప్రచురితమైన కథనానికి ఎంపీడీవో, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ చర్యలు తీసుకున్నారు.
- మే 5న దహెగాం సహకార సంఘంలో జరిగిన అవినీతిపై 'సహకారంలో అవినీతి'శీర్షికన కథనం ప్రచురితమైంది. ఉన్నతాధికారులు స్పందించి సీఈవో బక్కయ్యను సస్పెన్షన్ చేశారు.
- జూలైలో పీకలగుండంలో నీటి సమస్యపై 'తాగునీటికి ప్రాణాలు పలం'శీర్షికన కథనం ప్రచురితమైంది. డీఎల్‌పీవో సురేష్ స్పందించి ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేశారు.

- **కౌటాల:** మండలంలోని గుడ్లబోరి గ్రామంలోని నిరుపేద కుటుంబానికి చెందిన చహారే కరీష్మా హైదరాబాద్‌లోని అపోల్‌లో ఎంబీబీఎస్‌లో సీటు సాధించింది. కుటుంబ ఆర్థిక పరిస్థితి రీత్యా అడ్మిషన్ ఫీజు చెల్లించేందుకు పడుతున్న ఇబ్బందులను 'సాక్షి'వెలుగులోకి తెచ్చింది. దాతల సాయంతో కళాశాలలో చేరింది. రెండో ఏడాదిలో ఫీజులు చెల్లించలేని పరిస్థితిలో జనవరి 3న 'ఫీజు కట్టలేక.. చదువు ప్రశ్నార్థకం'శీర్షికన కథనం ప్రచురితమైంది. హైదరాబాద్‌కు చెందిన ఓ ఎన్‌జీఓతోపాటు దాతలు రూ.1.75 లక్షల సాయం అందించారు.
- ఆగస్టు 11న గుండాయిపేటకు చెందిన పదో తరగతి విద్యార్థిని జాడె పూజ(16) జ్వరంతో బాధపడుతుండగా.. ఆర్‌ఎంపీ వైద్యం అందించడంతో వైద్యం వికటించి మృతి చెందింది. అదే గ్రామానికి చెందిన బోయర్ కాళిదాస్ (32) ఆర్‌ఎంపీ వైద్యం వికటించి మృతి చెందాడు. ఈక్రమంలో గత ఆగస్టు 12న 'కిల్లింగ్ జ్వరాలు..!'శీర్షికన కథనం ప్రచురితమైంది. డీఎంహెచ్‌వో, ఆర్డీవో, డీపీవో, అధికారులు స్పందించి విచారణ చేపట్టి ఆర్‌ఎంపీలు వైద్యం చేయవద్దని హెచ్చరించారు.



తప్పిన ప్రమాదం

లక్ష్మణచాంద: మండలంలోని మల్లాపూర్ నుంచి పార్‌పెల్లి వెళ్లే మట్టిరోడ్డు ప్రమాదాలకు నెలవుగా మారింది. గురువారం మల్లాపూర్ నుంచి టాటాఏస్ వాహనం పార్‌పెల్లి వెళ్తుండగా అదుపుతప్పి గుంతలో దిగబడింది. డ్రైవర్‌కు త్రుటిలో ప్రమాదం తప్పింది. ఇప్పటికైన అధికారులు గుంత పూడ్చివేసేలా చర్యలు తీసుకోవాలని గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

■ రెగ్యులర్ & డిస్టెన్స్: డిగ్రీ, PG, B.Tech, ఫార్మసీ, GNM, నర్సింగ్, B.Ed, B.P.Ed, MBA. Dr.J S అకాడమి (ISO 9001: 2015 సర్టిఫైడ్). ఫోన్: 8866977112 [HA-15347]

SERVICES

BUSINESS SERVICES

■ మీ బంగారం మణప్పురం, ముత్తూట్, ఏ ఇతర ఫైనాన్స్‌లో ఉన్న మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. ఫోన్ : 9177555694. [H-783410]

WANTED

■ Universal కంపెనీకి వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. జీతం : 15,000 నుండి 20,000 వరకు సంపాదించుకోండి. అడ్రస్ వాట్సాప్ చేయండి. సెల్ : 95027 12418. [M-1256019]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602888
9010299065
9951602823
9010608462

దారి దోపిడీకి యత్నం


- ప్రతిఘటించిన బాధితుడు.. దొంగలు పరార్
- బాధితుడికి కత్తి గాయాలు
- త్రుటిలో తప్పిన ప్రాణాపాయం



గాయపడ్డ సురేశ్

గుడిహత్నూర్: దారిలో దోపిడీకి ప్రయత్నించిన దొంగలు బాధితుడు ధైర్యంగా ప్రతిఘటించడంతో పరార్ అయ్యారు. మండల కేంద్రంలో బుధవారం రాత్రి ఈఘటన చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. మండల కేంద్రానికి చెందిన బండి సురేశ్ స్థానిక వైన్స్‌షాపులో పని చేస్తున్నాడు. ఎప్పటిలాగా బుధవారం రాత్రి 9 గంటల అనంతరం వైన్స్ షాపు మూవేసి సహచర ఉద్యోగి రాజుతో వేర్వేరు బైక్‌లపై ఇంటికి బయల్దేరారు. అప్పటికే సురేశ్‌ను నలుగురు దొంగలు రెండు స్కూటీలపై అనుసరించారు. శివాలయం వెనుక చీకటిగా ఉన్న జాతీయ రహదారి వద్ద ఒక్కసారిగా సురేశ్ బైక్‌ను ఢీకొట్టారు. కంట్లో కారం చల్లి మెడకు కత్తి పెట్టి నగదు బ్యాగు లాక్కునే ప్రయత్నం చేశారు. తీవ్రంగా ప్రతిఘటిస్తూ గట్టిగా అరవడంతో ముందు వెళ్తున్న రాజు బైక్‌ను వెనుకకు రావడంతో దొంగలు కత్తితో సురేశ్‌ను గాయపర్చి పరారయ్యారు. తీవ్రగాయాలైన అతడు ఎస్సై మహేందర్‌కు జరిగిన విషయాన్ని వివరించారు. ఎస్సై సంఘటన స్థలానికి చేరుకొని గాలింపు చర్యలు చేపడుతున్నారు. కాగా, సురేశ్ బ్యాగులో రూ.3 లక్షల నగదు ఉంది. దోపిడీకి యత్నించిన వారంతా యువకులేనని బాధితుడు తెలిపాడు. రాజు వెనకకు రావడంతో సురేశ్‌కు ప్రాణప్రాయం తప్పింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.


ఉరేసుకుని యువతి ఆత్మహత్య



స్వాతి (ఫైల్)

కౌటాల: మండల కేంద్రానికి చెందిన యువతి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. వివరాలు ఇలా ఉన్నాయి.. పిట్టల సత్యనారాయణ–పార్వతి దంపతులకు కుమారుడు, కుమార్తె స్వాతి ఉన్నారు. డిగ్రీ పూర్తి చేసిన స్వాతి (23) ఇంటి వద్దే ఉంటున్నారు. గురువారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుంది. కుటుంబీకులు గమనించి సిర్పూర్(టి) ప్రభుత్వ సామాజిక ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షించగా మృతిచెందినట్లు నిర్ధారించారు. ఆమె మృతికి గల కారణాలు తెలియరాలేదు. తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైలు కిందపడి యువకుడి..



సిద్ధార్థ (ఫైల్)

బెల్లంపల్లి: రైలు కిందపడి యువకుడు బుధవారం అర్ధరాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ రాజేశ్వర్ కథనం ప్రకారం.. రైల్వే రడగంబాల బస్తీలో నివాసం ఉంటున్న కదాసీ సిద్ధార్థ (17) పట్టణంలోని బట్టల షాపులో వర్కర్‌గా పనిచేస్తున్నాడు. ఈక్రమంలో ఓ అమ్మాయిని ప్రేమించాడు. తన ప్రేమకు గుర్తుగా సదరు చేతిపై టాటు వేయించుకున్నాడు. ఇటీవల సదరు అమ్మాయి మరో యువకుడిని ప్రేమిస్తున్నట్లు తెలుసుకున్న సిద్ధార్థ భరించలేకపోయాడు. తీవ్ర మనస్తాపం చెంది ఎడమ చేతిపై కత్తితో గాట్లు వేసుకుని కాల్‌టెక్స్ రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. గురువారం మృతదేహానికి ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం కుటుంబీకులకు అప్పగించారు. తండ్రి శంకర్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు జీఆర్పీ రైల్వే హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

అన్నపై దాడి చేసిన తమ్ముడికి ఆరునెలల జైలు

ఆదిలాబాద్‌టౌన్: అన్నపై దాడి చేసిన తమ్ముడికి ఆరు నెలల జైలుశిక్షతోపాటు రూ.3 వేల జరిమానా విధిస్తూ జేఎఫ్‌సీఎం జడ్జి దుర్గరాణి గురువారం తీర్పునిచ్చారు. లైజన్ అధికారి గంగాసింగ్ కథనం ప్రకారం.. ఆదిలాబాద్‌రూరల్ మండలంలోని రాంపూర్ (రామాయి)కి చెందిన అన్న దుర్వెట్టి నారాయణపై తమ్ముడు సకారాం 2018 అక్టోబర్ 21న కర్రతో తలపై దాడి చేశాడు. అడ్డు వచ్చిన నారాయణ భార్య పంచపూలపై చెయ్యి చేసుకున్నాడు. ఆమె ఫిర్యాదుతో అప్పటి ఎస్సై హరిబాబు కేసు నమోదు చేశారు. పీపీ నవీన్ కుమార్ 8మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా నేరం రుజువైంది. ఈ మేరకు జడ్జి తీర్పునిచ్చినట్లు వివరించారు.

ట్రాక్టర్‌ను ఢీకొని యువకుడి మృతి

భైంసారూరల్: ట్రాక్టర్‌ను ఢీకొని యువకుడు మృతి చెందినట్లు ఎస్సై మాలిక్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. కుంటాల మండలం విఠ్ఠాపూర్‌కు చెందిన ఏలేటి ఇంద్రారెడ్డి (35) గురువారం రాత్రి బైక్‌పైన భైంసాకు వస్తున్నాడు. వానల్‌పాడ్ వద్ద ట్రాక్టర్‌ను ఢీకొని అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని భైంసా ఏరియాస్పత్రికి తరలించారు. మృతుడికి భార్యతోపాటు ఒక కుమారుడు ఉన్నారు. కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



చిన్నారితో అక్షర శ్రీకారం చేయిస్తున్న అర్చకుడు

బాసరలో భక్తుల రద్దీ



క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు

బాసర: వరుసగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు సెలవులు రావడంతో బాసరకు భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. గురువారం శుభ ముహూర్తం కావడంతో శ్రీజ్ఞాన సరస్వతీ అమ్మవారి దర్శనానికి క్యూలైన్‌లో బారులు తీరారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ముందుగా పవిత్ర గోదావరినదిలో పుణ్యస్నానాలాచరించారు. శివాలయంలో పూజలు చేశారు. భక్తులు కుంకుమార్చన, అక్షరాభ్యాస పూజలు చేశారు. అక్షరాభ్యాస మండపంలో చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఆలయ కార్యనిర్వహణాధికారి నవీన్‌కుమార్ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వేకువజామున శ్రీజ్ఞాన సరస్వతీ, మహాలక్ష్మీ, మహాకాళీ అమ్మవార్లకు ఆలయ అర్చక వైదిక బృందం ఆధ్వర్యంలో ప్రత్యేక అభిషేకం, అర్చన, గణపతి, సరస్వతీమాతా పారాయణం తదితర విశేష పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ, ప్రసాదాలు అందజేశారు. అమ్మవారి దర్శనానికి గంట సమయం పట్టినట్లు అధికారులు వెల్లడించారు.

- సాఫ్ట్‌బేస్‌బాల్ విజేత కేరళ జట్టు
- అన్ని విభాగాల్లోనూ సత్తాచాటిన క్రీడాకారులు
- ద్వితీయ, తృతీయ స్థానాల్లో తెలంగాణ రాష్ట్ర క్రీడాకారులు
- మూడో స్థానంలో మధ్యప్రదేశ్ జట్టు
- విజేతలకు బహుమతులు ప్రదానం

ముగిసిన జాతీయస్థాయి పోటీలు



కేరళ రాష్ట్ర సబ్ జూనియర్ బాలుర జట్టుకు ట్రోఫీ అందిస్తున్న ప్రవీణ్



ఓవరాల్ ఛాంపియన్ షిప్ సాధించిన కేరళ రాష్ట్ర క్రీడాకారులు

బెల్లంపల్లి: బెల్లంపల్లి కేంద్రంగా నిర్వహించిన జాతీయ స్థాయి సాఫ్ట్ బేస్‌బాల్ పోటీలు గురువారం అట్టహాసంగా ముగిశాయి. ఈ నెల 24న సింగరేణి తిలక్ స్టేడియంలో ప్రారంభమైన జాతీయ స్థాయి 9వ సబ్ జూనియర్ బాలబాలికలు, మెన్(యూత్), ఉమెన్ విభాగాల్లో పోటీలు మూడు రోజులపాటు హోరాహోరీగా సాగాయి. దేశ వ్యాప్తంగా 12 రాష్ట్రాల నుంచి క్రీడాకారులు హాజరయ్యారు. గురువారం ఉదయం సెమీఫైనల్ మ్యాచ్‌లు రసవత్తరంగా సాగాయి. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన జట్లు ఫైనల్‌కు చేరాయి. ఫైనల్ మ్యాచ్‌లో ఆది నుంచి అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు విన్నర్స్, రన్నర్స్‌గా నిలిచారు. పోటీల్లో కేరళ రాష్ట్ర క్రీడాకారులు ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించారు. విజేతలకు జిల్లా కలెక్టర్ కుమార్‌దీపక్, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడు రేణికుంట్ల ప్రవీణ్ ముఖ్య అతిథులుగా హాజరై సాఫ్ట్‌బేస్‌బాల్ రాష్ట్ర అధ్యక్షుడు పి.రవికుమార్‌తో కలిసి బహుమతి ప్రదానం చేశారు.

సబ్ జూనియర్ బాలుర విభాగంలో..

సబ్‌జూనియర్ బాలుర విభాగంలో కేరళ రాష్ట్ర జట్టు ప్రథమ, మహారాష్ట్ర జట్టు ద్వితీయ, తెలంగాణ రాష్ట్ర జట్టు తృతీయ బహుమతి గెలుచుకున్నారు.

బాలికల విభాగంలో ..

సబ్ జూనియర్ బాలికల విభాగంలోనూ కేరళ రాష్ట్ర జట్టు అత్యుత్తమ ప్రతిభ కనబర్చి ప్రథమ బహుమతి గెలుచుకున్నారు. తెలంగాణ రాష్ట్ర జట్టు ద్వితీయ, మధ్యప్రదేశ్ రాష్ట్ర జట్టు తృతీయ బహుమతి దక్కించుకున్నారు.

యూత్ మెన్ విభాగంలో ..

యూత్ మెన్ విభాగంలో కేరళ రాష్ట్ర జట్టు ప్రథమ బహుమతిని గెలుచుకుని అబ్బుర పరిచింది. తెలంగాణ రాష్ట్ర జట్టు ద్వితీయ, మధ్యప్రదేశ్ జట్టు తృతీయ బహుమతి గెలుచుకున్నారు.

యూత్ మహిళల విభాగంలో..

యూత్ మహిళల విభాగంలోనూ కేరళ రాష్ట్ర జట్టు తిరుగులేని ఆటతీరును ప్రదర్శించింది. కేరళ ప్రథమ, తెలంగాణ ద్వితీయ, మధ్యప్రదేశ్ తృతీయ బహుమతి గెలుచుకున్నాయి.

తిరుగులేని ఆధిక్యత కనబర్చిన కేరళ

పోటీల్లో కేరళ రాష్ట్ర క్రీడాకారులు తిరుగులేని ఆధికత్యను కనబర్చారు. సబ్ జూనియర్ బాలబాలికల, యూత్ విభాగంలో జరిగిన మెన్, ఉమెన్ పోటీల్లో పట్టుదలతో ఆడారు. క్రీడాపోటీలకు ఆతిథ్యం ఇచ్చిన తెలంగాణ జట్లు ద్వితీయ, తృతీయ బహుమతులు గెలుచుకోగా, మధ్యప్రదేశ్ రాష్ట్ర క్రీడాకారులు మూడో స్థానాన్ని కైవసం చేసుకున్నారు. బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి డి.గురువేందర్, జాయింట్ సెక్రెటరీ యు.వెంకటేష్, కోశాధికారి ఇమ్మానియెల్ దినకర్, కాంగ్రెస్ నాయకులు మునిమంద రమేష్, నాతరి స్వామి, త్రోబాల్ జిల్లా సెక్రెటరీ బలరాం, తైక్వాండో ఉమ్మడి జిల్లా ఇంచార్జి జిల్లపల్లి వెంకటస్వామి, అండర్–19 ఎస్‌జీఎఫ్ ఉమ్మడి జిల్లా సెక్రెటరీ బాబురావు తదితరులు పాల్గొన్నారు.